

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం,18 జనవరి 2026

8 పేజీలు


# ప్రపంచ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఏపీ..

## కాకినాడలో చారిత్రక ఘట్టం !





**రూ.13,000 కోట్లతో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్లాంట్‌కు శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్**

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక చరిత్రలో నేడు ఒక స్వర్ణ అధ్యాయం లిఖించబడింది. రాష్ట్రాన్ని గ్లోబల్ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చే దిశగా అడుగులు వేస్తూ, కాకినాడలో ప్రపంచంలోనే అతిపెద్ద 'సింగిల్ సైట్' గ్రీన్ అమోనియా ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ శనివారం ఘనంగాశంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా ఏఎమ్ గ్రీన్ (గ్రీన్‌కో గ్రూప్) సంస్థకు చెందిన యంత్ర పరికరాల బిగింపు పైలాన్‌ను వారు ఆవిష్కరించారు.

- తరువాయి 2లో..

## హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం



**- కాకినాడలో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన**


**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గ్రీన్‌ఎనర్జీ హబ్‌గా మార్చే దిశగా నేడు కాకినాడలో కీలక అడుగు పడింది. కాకినాడ పోర్టు సమీపంలో ఏఎమ్ గ్రీన్ సంస్థ ఏర్పాటు చేయనున్న ప్రతిష్టాత్మకమైన గ్రీన్ హైడ్రోజన్ మరియు గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కలిసి శంకుస్థాపన చేశారు.

**హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం..** శనివారం ఉదయం అమరావతి నుండి ప్రత్యేక హెలికాప్టర్‌లో కాకినాడ చేరుకున్న ముఖ్యమంత్రికి హెలిప్యాడ్ వద్ద జిల్లా ఇంచార్జి కలెక్టర్ అపూర్వ భరత్

- తరువాయి 2లో..

# ఆర్అండ్‌బి 'టెక్నికల్ వ్యవస్థపై ఎస్ఈ కాంతు 'విష కౌగిలి'!

- గత ఎస్ఈ ఇచ్చిన ఉత్తర్వులతో ప్రస్తుత ఎస్ఈ గారడీ!
- అప్పటి 'అవసరం'.. కాంతుకు ఇప్పుడు 'అవకాశం'!
- టీఓ ఉన్నా లేనట్టే.. అక్రమాల కోసం వ్యవస్థ ఖూనీ!
- లీడ్లు, డేట్స్ పరిశీలించే టీఓ అధికారం హతం..
- ఒక్క ఫైలు కూడా కదలనివ్వని గెద్దం చాటు కుట్ర!
- ఏసీబీ నిద్రపోతోందా? విజిలెన్స్ కళ్లు మూసుకుందా? కలెక్టర్ భరత్ గారూ.. ఈఅరాచకాన్ని అంతం చేయరా?




**రికార్డులు కబ్జా..రిజిస్టర్లు హైజాక్!**
**టీఓ చేతుల్లోంచి ఫైళ్లు లాక్కుని..వ్యవస్థ ఊపిరి తీస్తున్న కాంతు అరాచకపాలన !**

అది సూపరింటెండింగ్ ఇంజనీర్ గారి అత్యున్నత కార్యాలయం. అక్కడ నిబంధనల ప్రకారం టెక్నికల్ ఆఫీసర్ కూర్చొని అంచనాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.కానీ అక్కడ సీన్ రివర్స్!అంచనాలు తయారు చేసి పంపాల్సిన ఫీల్డ్ జేఈలే నేరుగా సర్కిల్ ఆఫీసులో తిష్టవేశారు.ఒక కేసులో సాక్ష్యాలను తనిఖీ చేసి తీర్పు చెప్పాల్సిన జడ్జినే పక్కన పెట్టి, ముద్దాయే వచ్చి తన తీర్పును తానే రాసుకుంటున్న చందంగా కాంతు ఏలుబడిలోని ఆర్అండ్‌బి కార్యాలయవ్యవహారం సాగుతోంది.ఫీల్డ్‌లో పనులు ఎలా ఉన్నాయో చూడాల్సిన జేఈలు,ఇక్కడ సర్కిల్ ఆఫీసులో ఏసీ గదుల్లో కూర్చొని..తమకు,తమ కాంట్రాక్టర్లకు అనుకూలంగా అంచనాల రిజిస్టర్లను తిరగరాస్తున్నారు. ఈ అవినీతి దోపిడీపై ఉమ్మడి గోదావరి జిల్లాల 'సూర్య' బ్యూరో అందించిన క్షేత్రస్థాయి పరిశీలనాత్మక ఇన్వెస్టిగేటివ్ కథనం..

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

- మిగతా 2 లో..



# హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం








మొదటిపేజి తరువాయి

ఘన స్వాగతం పలికారు.

**ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో:**

- **మంత్రులు: రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు.**
- **ప్రజా ప్రతినిధులు:** స్థానిక ఎంపీలు, ఎమ్మెల్సీలు మరియు ఎమ్మెల్యేలు.
- **అధికారులు:** జిల్లా ఎస్పీ మరియు ఇతర ఉన్నతాధికారులు.

ముఖ్యమంత్రికి పూలమాలలు వేసి, దుశ్శాలువాలతో ప్రజా ప్రతినిధులు సాదరంగా ఆహ్వానించారు.

**ప్రాజెక్టు విశేషాలు – ముఖ్యాంశాలు**

సుమారు రూ.15,600 కోట్ల (కొన్ని అంచనాల ప్రకారం రూ.18,000 కోట్లు) భారీ పెట్టుబడితో, 495 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది.

- **గ్రీన్ ఎనర్జీ హబ్:** ఈ ప్రాజెక్టు పూర్తయితే ఏటా 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి జరుగుతుంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టులలో ఒకటిగా నిలవనుంది.

**–ఉద్యోగ అవకాశాలు**: ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా సుమారు 8,000 మందికి ఉపాధి లభించనుంది.

- **ఎగుమతులు:** ఇక్కడ తయారయ్యే గ్రీన్ అమ్మోనియాను జర్మనీ, జపాన్ మరియు సింగపూర్ వంటి దేశాలకు ఎగుమతి చేయనున్నారు.



**పర్యావరణ హితం:** బొగ్గు, గ్యాస్ వాడకుండా పునరుత్పాదక శక్తితో ఈ ప్లాంట్ పనిచేస్తుంది, దీనివల్ల కార్బన్ ఉద్గారాలు ఉండవు.

ముఖ్యమంత్రి ప్రసంగం శంకుస్థాపన అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. కాకినాడను "గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ఆఫ్ ఇండియా" గా అభివర్ణించారు. 2027 జూన్ నాటికి మొదటి దశ ఉత్పత్తిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి, యువతకు ఉద్యోగాల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## ప్రపంచ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా ఏపీ..
## కాకినాడలో చారిత్రక ఘట్టం!

మొదటిపేజి తరువాయి

**ఏపీ గ్రీన్ ఎనర్జీలో 'సౌదీ అరేబియా' కావాలి : సీఎం చంద్రబాబు**

శంకుస్థాపన అనంతరం జరిగిన భారీబహిరంగసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్వేగభరితంగా ప్రసంగించారు. "రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీలో సౌదీ అరేబియాగా మార్చడమే నా లక్ష్యం. ఈ ప్రాజెక్టు కేవలం పరిశ్రమ మాత్రమే కాదు,గ్లోబల్ క్లైమేట్ చేంజ్‌పై ఏపీ చేస్తున్న యుద్ధం.తెలుగువారి సత్తాను ప్రపంచానికి చాటిచెప్పేలా 2027 నాటికి ఇక్కడినుంచి జర్మనీ, జపాన్ వంటి దేశాలకు ఇంధనాన్ని ఎగుమతి చేస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు. గతంలో మూతపడిన నాగార్జున ఫెర్టిలైజర్స్ (ఎన్‌ఎఫ్‌సిఎల్) స్థానంలో, ఆధునిక సాంకేతికతతో ఈ పర్యావరణ హిత ప్లాంట్ రావడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు.

**అభివృద్ధి–పర్యావరణం రెండూ సమానమే: పవన్ కళ్యాణ్**

ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ,పెట్టుబడిదారులకు ప్రభుత్వం కొండంత అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు."అభివృద్ధి అంటే కేవలం కాంక్రీట్‌కట్టడాలుకాదు,ప్రకృతిని కాపాడుకుంటూ యువతకుఉపాధి కల్పించడం. ఈ ప్రాజెక్టు ద్వారా వేల సంఖ్యలో ఉద్యోగాలు వస్తాయి.పర్యావరణాన్ని రక్షిస్తూనే పారిశ్రామిక విప్లవంసాధిస్తాం" అని అన్నారు.

**వార్తలోని ముఖ్యాంశాలు: భారీ పెట్టుబడి:**సుమారు రూ.13,000 కోట్ల ప్రాథమిక పెట్టుబడి (మొత్తం 10 బిలియన్ డాలర్ల ప్రాజెక్టు).

- **ఉద్యోగ అవకాశాలు:** ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా సుమారు 8,000 మందికి ఉపాధి.
- **ఉత్పత్తి లక్ష్యం**: 2027 జూన్ నాటికి ఏడాదికి 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి.
- **అంతర్జాతీయ గుర్తింపు:** జర్మనీ,జపాన్,సింగపూర్ వంటి దేశాలకు ఎగుమతులు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.మాధవ్, రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, పలువురు అంతర్జాతీయ వ్యాపారవేత్తలు మరియు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సాయి క్యాలెండర్ ఆవిష్కరణ

**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక ఆదివారం పేట లో వేంచేసి ఉన్న శ్రీ షిరిడి సాయి ప్రేమ మందిరం ఆలయ వ్యవస్థాపకులు ఇసుక పల్లి తాతారావు (ఐటిఆర్) శ్రీ షిరిడి సాయి ప్రేమ మందిర్ తరఫున ప్రతీ సంవత్సరం వేయించే నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు ఈ ఆలయ అభివృద్ధికి పాటు పడుతున్న మన అధ్యక్షుల వారిని,మన సాయి సేవకులను అభినందించారు.

# ఆర్అండ్‌బి 'టెక్నికల్ల వ్యవస్థపై ఎస్ఈ కాంతు 'విషకౌగిలి'!

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

**అప్పటి 'అవసరం'.. కాంతుకు ఇప్పుడు 'అవకాశం'!**

కాకినాడ ఆర్&బి సర్కిల్‌లో ఎస్.ఈ.గా కాంతు బాధ్యతలు చేపట్టే నాటికే ఒక స్పష్టమైన పాలనా వ్యవస్థ ఉంది. గతంలో పనిచేసిన ఎస్.ఈ. గారు రెండు కీలక ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి ఉత్తర్వులో టెక్నికల్ ఆఫీసర్‌కు పూర్తిస్థాయి అధికారాలు కల్పిస్తూ, ప్రతి ఫైలు ఆయన ద్వారానే వెళ్లాలని నిబంధన విధించారు. అయితే, అప్పటి టీఓ సత్యనారాయణ గారు బదిలీపై వెళ్లడంతో, అక్కడ సంపూర్ణ స్థాయి టీఓ లేని లోటు ఏర్పడింది. ఆ సమయంలో పని ఆగకూడదనే 'అవసరం' కొద్దీ, అదే గత ఎస్.ఈ. గారు జేఈలకు కొన్ని బాధ్యతలు అప్పగిస్తూ రెండో తాత్కాలిక ఉత్తర్వు ఇచ్చారు.ప్రస్తుత ఎస్.ఈ. కాంతు గారు బాధ్యతలు చేపట్టాక, ఈ తాత్కాలిక ఏర్పాటును తనఅవినీతికి ఒక అవకాశంగా మలుచుకున్నారని తెలుస్తోంది. టెక్నికల్ అధికారిపోస్టులో పూర్తిస్థాయి అధికారి అందుబాటులో ఉన్నప్పటికీ కుంటి సాకు చూపిస్తూ, తన అక్రమాలకు కంచెలా అడ్డుగా ఉన్న టీఓఅధికారాలను పూర్తిగా నిర్వీర్యం చేసేశారు. నిబంధనల ప్రకారం ఉన్న మొదటి ఉత్తర్వును తుంగలో తొక్కి, కేవలం తన దోపిడీకి అనుకూలంగా ఉన్న రెండోతాత్కాలికఉత్తర్వునేపట్టుకుని వేలాడుతున్నారు. టీఓ వ్యవస్థను ఉత్సవ విగ్రహంగా మార్చి, జేఈల ద్వారా కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడటం బిఎన్ఎస్ సెక్షన్ 61 నేరపూరిత కుట్ర కిందకు వస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**లీడ్లు, ధరల మాయాజాలం:టీఓ అధికారాల హతం!**

ఒక ఇంజనీరింగ్ ప్రాజెక్టులో మెటీరియల్ రవాణా దూరం మరియు పని ధరల మొత్తాన్ని డిసైడ్ చేసే ప్రధాన అంశాలు. లీడ్లు–ధరలు వీటిని క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సిన బాధ్యత టెక్నికల్ ఆఫీసర్ ది.ఈ నిఘాను జెఇఇలకు అప్పగించడం చారిత్రాత్మక తప్పిదం.. అవినీతి అరాచకమే.

– లీడ్ చార్జీల లూటీ: కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకు, ఎస్.ఈ. కాంతు ఉద్దేశపూర్వకంగా లీడ్ చార్జీలను పెంచేస్తున్నారని, టీఓ ఈ తప్పులను పట్టుకుంటారనే భయంతో, టీఓకు ఏమీ రాదని ముద్ర వేసి ఆయన అధికారాలను హతం చేశారని చెబుతున్నారు.

**– తేదీల తారుమారు:**పని జరిగిన తేదీలను మార్చేస్తూ, ధరలు పెరిగిన సమయానికి అనుగుణంగా బిల్లులు పెంచి ప్రభుత్వ ఖజానాకు కన్నం వేస్తున్నారు.ఈలీడ్లు,డేట్స్ మార్చేస్తూప్రజాధనాన్నికాంట్రాక్టర్లకు ధారదత్తం చేయడం అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13 కిందకు వస్తుంది.

**రికార్డులు హైజాక్.. చట్టం ఏం చెబుతోంది? వీరేం చేస్తున్నారు?**

సాధారణంగా టెక్నికల్ ఆఫీసర్ ఆధీనంలో ఉండాల్సిన కీలక రిజిస్టర్లను జూనియర్ ఇంజనీర్ల పరం చేయడం వెనుక భారీ కుట్ర దాగి ఉంది. ఇక్కడ చట్టం మరియు నిబంధనలను కాంతు ఏలుబడిలో ఎలా తుంగలో తొక్కుతున్నారో చూడండి:

– ఏలా జరగాలి చట్టంలోని నిబంధనల ప్రకారం: సర్కిల్ ఆఫీసులోని టెండర్ రిజిస్టర్, సీఆర్ అగ్రిమెంట్ రిజిస్టర్, సాంక్షన్ ఎస్టిమేట్ రిజిస్టర్ మరియు మెయింటినెన్స్ రిజిస్టర్లు అన్నీ టెక్నికల్ ఆఫీసర్ ఆధీనంలో ఉండాలి. ఆయన పర్యవేక్షణలో మాత్రమే ఎంట్రీలు జరగాలి. ఇది పారదర్శకత కోసం చట్టం నిర్దేశించిన పద్ధతి. టివో గా సత్యనారాయణ ఉన్నంతవరకు ఇలాగే జరిగింది. ఆయన బదిలీపై వెళ్లిన తర్వాతే.. కాంతు ఎస్సీగా వచ్చిన తర్వాతే అ అరాచక అవినీతి మొదలైంది.

**– ఏం జరుగుతోంది అరాచక పాలనలో :**టీఓకు ఈ రిజిస్టర్లను స్వేచ్ఛగా పరిశీలించే అవకాశం కూడా ఇవ్వకుండా, ఎస్.ఈ. కాంతు వీటిని జేఈల బ్యాగుల్లోకి చేర్చారు. ఫీల్డ్ ఆఫీసర్లే నేరుగా సర్కిల్ ఆఫీసు రికార్డులు రాయడం అనేది రికార్డుల ట్యాంపరింగ్ కిందకు వస్తుందని మేధావుల పేర్కొంటున్నారు.

– సెక్షన్ల కోడీకరణ: ప్రభుత్వ రికార్డులను పక్కదారి పట్టించడం, అధికారిక రిజిస్టర్లను అనధికార జేఈల చేత రాయించడం బిఎన్ఎస్ సెక్షన్ 336 ఫోర్జరీ రికార్డుల ట్యాంపరింగ్ మరియు బిఎన్ఎస్ సెక్షన్ 316 ప్రభుత్వ నమ్మక ద్రోహం కిందకు వచ్చే నేరాలుగా ప్రజలు చర్చిస్తున్నారు. టెక్నికల్ ఆఫీసర్ హక్కులను కాలరాయడం ద్వారా ఇక్కడ వ్యవస్థీకృతనేరం,అవినీతిజరుగుతోందనిప్రజలుగాఢంగా నమ్ముతున్నారు.

**బట్టబయలైన బినామీ భాగోతం! సంతకం లేని ఆమోదాలు:**

రిజిస్టర్‌లో ఎంట్రీ పడకుండానే ఎస్.ఈ. కాంతు ఫైళ్లకు ఆమోదం తెలపడం వెనుక మర్మమేంటి? టీఓ పాత్రను ఎందుకు విస్మరించారు?

**– హ్యాండ్‌రైటింగ్ తారుమారు**

రిజిస్టర్లలో రాతలు జేఈలవి.. సంతకాలు మాత్రం ఎస్.ఈ. గారివి.. ప్రభుత్వ రికార్డులను ఇలా ట్యాంపరింగ్ చేయడం నేరం కాదా?

– రేట్ల రాకెట్ : ఏ తేదీన పని జరిగింది? ఏ తేదీన రికార్డింగ్ చేశారు? ఆ మధ్య కాలంలో రేట్లు ఎంత పెరిగాయి? అన్నది తనిఖీ చేస్తే కోట్ల కుంభకోణం బయటపడుతుందని చెబుతున్నారు.

**అడ్వకేట్ 'ఆర్‌టిఐ' అస్త్రం.. వణుకుతున్న అవినీతి తిమింగలం!**

ఈ వ్యవస్థీకృత నేరంపై హైకోర్టు అడ్వకేట్ యుద్ధం ప్రకటించారు. ఆయన సంధించిన 10 పాయింట్ల దశదిగ్బంధన ఆర్‌టిఐ అస్త్రం ఇప్పుడు సర్కిల్ ఆఫీసు పునాదులనుకదిలిస్తోంది. "రిజిస్టర్లలో సంతకాలు లేని ఫైళ్లకు ఆమోదం ఎలా ఇచ్చారు?", "ఫీల్డ్ ఆఫీసర్లు సర్కిల్ ఆఫీసులో రికార్డులు ఎలా రాస్తారు?" – ఈ పదునైన ప్రశ్నలతో ఆయన వేసిన దరఖాస్తు, ఎస్.ఈ. అవినీతి కోట గోడలను బద్దలు కొట్టేలా ఉంది. ఇంత అరాచక పాలనపై ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ భరత్, విజిలెన్స్, ఏసీబీ శాఖలో పూర్తిగా దృష్టి పెట్టి ప్రభుత్వ ధనం వృధా కాకుండా అధికారులు కాంట్రాక్టర్ల అపవిత్ర వల్ల ప్రభుత్వ ధన లూటీ కాకుండా ప్రజలు కోరుకుంటున్నారు.

# జనసంద్రంగా వాడపల్లి క్షేత్రం





– భక్తవత్సలుడుకు భక్తుల నీరాజనాలు

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కలియుగ వైకుంఠం వాడపల్లి వెంకటేశ్వర స్వామి వారికి శనివారం భక్తులు నీరాజనాలు సమర్పించారు. ఉదయం వేకువజామునే సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి నీరాజనం మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించి తనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. రాష్ట్ర నలుమూల నుండి కాలినడకన వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. ఆలయ ప్రాంగణ మంతా భక్తుల గోవింద నామ స్మరణతో ప్రతిధ్వనించింది. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్ రాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావులు ఏర్పాటును పూర్తి చేసి పర్యవేక్షించారు. ప్రసాద వితరణ అన్నదానం నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏలేశ్వరం, ఏలూరు, రాజమహేంద్రవరం, గోకవరం, విజయవాడ, విశాఖపట్నం నుండి ప్రత్యేక బస్సులు నడిపారు. వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సీఐ విద్యాసాగర్, ఎస్సై ఎస్.రాము తన సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ అనంతరం అన్నదానం నిర్వహించారు. స్వామివారి ఆదాయం రూ.50 లక్షలు సమకూరింది.

# పాలమడుగు గ్రామంలో ఘనంగా ప్రారంభమైన క్రీడా పోటీలు

ఎటపాక, మేజర్ న్యూస్ : పోలవరం (రంపచోడవరం )జిల్లా ఎటపాక మండలం పాలమడుగు గ్రామ పరిధిలో పర్షిక వైశాలి జ్ఞాపకార్థంగా క్రీడా పోటీలు వాలీబాల్ మరియు ఆర్చరీలను వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు బొల్ల పుల్లయ్య, టీడీపీ రాష్ట్ర నాయకులు ముచ్చా శ్రీనివాస్, ఏటిఏ మండల అధ్యక్షుడు కాకరాజు, అపక రమేష్ (పీడీ)చే శనివారం క్రీడా పోటీలను ప్రారంభించడం జరిగింది. ముందుగా మీడియం సురేష్ అధ్యక్షతన ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించడం జరిగింది. అపక రమేష్ ద్వారా క్రీడా జెండాను ఎగరవేసి క్రీడలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర నాయకులు ముచ్చా శ్రీనివాస్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రీడలలో ముందుండాలని సూచించారు. ఏటీఏ మండల అధ్యక్షులు కాకరాజు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ఆరోగ్యాన్ని కలిగిస్తాయని అన్నారు. యువత చదువుతోపాటు క్రీడలు అన్ని రంగాల్లో



ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఇటి లక్ష్మణ్, సవలం ముత్తయ్య, సోంది రమేష్, వెంకటేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటిన
# టీడీపీ సీనియర్ నాయకులు కానూరి బుల్లాబ్బాయి



**ఎటపాక, మేజర్ న్యూస్ :** పోలవరం (రంపచోడవరం) జిల్లా ఎటపాక మండలం గౌరీదేవిపేట పంచాయతీ పరిధిలో గల బిసి కాలనీలో గత కొంతకాలంగా పక్షవాత కారణంగా కాలు చేయి పడిపోయి, అనారోగ్యంతో బాధపడుతున్న కౌలూరి ఇందిరమ్మ అనే వృద్ధురాలికి టీడీపీ సీనియర్ నాయకులు కానూరి బుల్లాబ్బాయి 2000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వం చాటుకున్నాడు. ఈ ఆర్థిక సహాయాన్ని శనివారం తెలుగుదేశం పార్టీ గౌరీదేవిపేట గ్రామ కమిటీ సభ్యుల చేతులు మీదుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎటపాక మాజీ మండల ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి అప్పలస్వామి, గ్రామ కమిటీ జనరల్ సెక్రెటరీ గొల్లపల్లి వీర వెంకట కిరణ్ కుమార్, గ్రామ కమిటీ కార్యదర్శి మల్లా పద్మారావు, బూత్ కన్వీనర్ మేడిపల్లి రఘు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు చంద్రు ప్రదీప్ కుమార్, గడ్డం నాగరాజు, కొత్తపెల్లి రాజశేఖర్, మేటికోటి రమేష్, బుడగం అశోక్, దారోగ కొండయ్య వారి కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగింది.

## జగన్మోహిని కేశవస్వామి అన్నదాన పథకానికి విరాళాలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి నిత్య అన్నదాన పథకానికి శనివారం విజయవాడకు చెందిన బి.వి.ఎస్. ఫణి కిరణ్ రూ.10,116లు; హైదరాబాద్‌కు చెందిన జి.వెంకట ఆదిత్య శర్మ రూ.10,116లు; విశాఖపట్టణంకు చెందిన వైధన హర్షిత్ రూ.10,116లు విరాళంగా సమర్పించారు. వీరికి అర్చకులు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. దాతలకు ఈవో భాగవతుల వెంకట రమణ మూర్తి, సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

## ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ క్రీడ పోటీలకు అంపైర్‌గా సాయిబాబు



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా తొండంగి మండలం సీతారామపురం గ్రామానికి చెందిన సువర్ణం సాయిబాబు కేఎల్ యూనివర్సిటీ విజయవాడలో 17వ తేది నుండి 21వ తేది వరకు జరగనున్న ఆల్ ఇండియా యూనివర్సిటీ బ్యాడ్మింటన్ మెన్ క్రీడా పోటీలకు అంపైర్‌గా సాయిబాబు నియమితులైనట్లు తెలియచేశారు. సాయిబాబు మాట్లాడుతూ ఈ ఆల్‌ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ క్రీడ పోటీలు మన రాష్ట్రంలో నిర్వహించడం చాలా సంతోసం అని అదేవిధంగా నాకూ అంపైర్‌గా అవకాశం దక్కడం ఆనందంగా భావిస్తున్నట్లు మరియు ఇంతకు ముందు జాతీయ స్థాయిలో జరిగిన టోర్నమెంట్స్‌కు అంపైర్‌గా చేసినట్లు తెలిపారు.

ఈ టోర్నమెంట్‌లో మన దేశం నలుమూలల ఉన్న జాతీయ స్థాయి క్రీడాకారులు వారి వారి విశ్వవిద్యాలయాలకు ప్రాతినిధ్యం వహిస్తూ వారి క్రీడను ఇక్కడ ప్రదర్శిస్తారు. ఈ టోర్నమెంట్‌లో 16 యూని వర్సిటీల నుండి క్రీడాకారులు పాల్గొంటున్నట్లు సమాచారం.

## శ్రీ సత్యదేవుని నిత్య అన్నదాన పథకానికి రూ.2 లక్షలు విరాళం





**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి రాజమండ్రి వాస్తవ్యులు బొమ్మన ఈశ్వరరావు రూ.1,00,116లు విరాళంగా దేవస్థానం పిఆర్‌ఓ అనకాపల్లి ప్రసాద్‌కు అందజేశారు.

దీనిపై వచ్చే వడ్డీతో మార్చి 1వ తారీఖున అన్నదానం జరిపించాలని దాత కోరినారు. ఇంకొక దాత అనంతపురం వాస్తవ్యులు కలవల గౌతం జయశ్రీ దంపతులు శ్రీ స్వామివారి అన్నదాన పథకానికి రూ.1,00,116లు విరాళంగా పిఆర్‌ఓ అనకాపల్లి ప్రసాద్‌కు అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో అక్టోబర్ 17వ తారీఖున అన్నదానం జరిపించవలసిందిగా దాత కోరినారు. దేవస్థానం అధికారులు దాతలను అభినందించారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# ‘మన్యం’లోనూ కత్తులు దూస్తున్న పందేం కోళ్లు!

- చేతులు మారుతున్న లక్షల రుపాయిలు
- ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు బేఖాతర్
- చూసిచూడనట్టు వదిలేసిన పోలీసులు

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగ సందర్భంగా పోలవరం (రంపచోడవరం) నూతన జిల్లా పరిధిలో ఏజెన్సీ ప్రాంతంలోను కోడి పందేలు జోరుగా సాగుతున్నాయి. అనేక ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహించడానికి ప్రత్యేకంగా బరులు ఏర్పాటు చేసి సందండిగా నిర్వహిస్తున్నారు. కోడి పందేలు అనేక చోట్ల జరుగుతున్నా పోలీసులు చూసిచూడనట్టుగా వదిలేయడంతో పందెం రాయిళ్లు రాత్రింబవళ్లు కోడిపందేలు యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. కోడిపందేలతో పాటు గుండాట, చిత్తులాట (పేకాట) సైతం నిర్వహిస్తున్నారు. సంక్రాంతికి ముందు ఎటువంటి జూదాలు నిర్వహించకూడదని, ఒకవేళ ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు చేశారు. కోడి పందాలు గుండాట పేకాట తదితర జూద క్రీడలతో ఏజెన్సీ ప్రాంతంలో పలు ప్రాంతాలు సందడిగా



మారాయి. కోడి పందేలు, గుండాట, ఇతర జూదాలు నిర్వహించడానికి సంబంధించి భారీగా ముడుపులు చెల్లించి నిర్వాహకులు ఎటువంటి ఆటంకం లేకుండా చేసుకున్నట్టు సమాచారం. కాగా సంక్రాంతి పండుగలు వెళ్లిపోయినా ఏజెన్సీ ప్రాంతంలో కోడి పందేలు జోరు మాత్రం ఇంకా అనేక చోట్ల కొనసాగుతోంది.

# స్వర్ణ గ్రామ సచివాలయాలలో సమయపాలన తప్పనిసరి

- డిప్యూటి ఎంపిడిఓ వై.శ్రీహరి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** స్వర్ణ, గ్రామ సచివాలయాలలో సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, పెద్దాపురం మండల స్వర్ణ గ్రామాధికారి వై.శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ సూచనల మేరకు మండలంలోని స్వర్ణ గ్రామ సచివాలయాలలో సిబ్బంది సమయ పాలన విధిగా పాటించాలని, ఆదేశాలు జారీ చేసినట్లు మండల స్వర్ణ గ్రామాధికారి వై.శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ పనితీరు పర్యవేక్షణకు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, ప్రజలకు మరింత వేగంగా సేవలు అందేలా, చర్యలు చేపట్టడంతో పాటు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు సమయ పాలన తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, ఇకపై ఆలస్యంగా విధులకు హాజరైతే ఆరోజు వేతనంలో కోత విధించడం జరుగుతుందని, స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉద్యోగుల పనివేళలు నిర్ణయించడం జరిగిందని, సిబ్బంది ఖచ్చితంగా నిబంధనలు పాటిస్తూ, విధులు నిర్వహించాలని ఆయన తెలిపారు. పెద్దాపురం మండలంలోని 22 సచివాలయాల పరిధిలో 208 మంది సచివాలయాల ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని, కావున ప్రతీ స్వర్ణ గ్రామ సచివాలయ ఉద్యోగి తు.చ తప్పకుండా విధులు నిర్వహించాలని, మండల స్వర్ణ గ్రామాధికారి వై.శ్రీహరి సూచించారు. మండలంలో ప్రతీరోజు రెండు మూడు సచివాలయాలను తాను పరిశీలించడం జరుగుతుందని, కావున విధుల నిర్వహణలో సచివాలయాల ఉద్యోగులు ఎటువంటి అలసత్వం వహించరాదని ఆయన సూచించారు.

# తూర్పుగోదావరి జిల్లాలో జనవరి 19 నుంచి 31 వరకు “పశు ఆరోగ్య శిబిరాలు”



- ప్రత్యేక ప్రచారం - గోడ ప్రతులు ఆవిష్కరణ - ఇంచార్జి కలెక్టర్ మేఘా స్వరూప్

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** పశువుల ఆరోగ్య పరిరక్షణ, ఉత్పాదకత పెంపు, వ్యాధుల నివారణ లక్ష్యంగా జనవరి 19 నుండి 31, 2026 వరకు జిల్లాలోని పశుపాలక రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టినట్లు తూర్పు గోదావరి ఇంచార్జి జిల్లా కలెక్టర్ (ఎఫ్ ఎ సి) / జిల్లా జాయింట్ కలెక్టర్ వై.మేఘాస్వరూప్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన “పశు ఆరోగ్య శిబిరాలు” ప్రత్యేక ప్రచార గోడ పత్రికలను శనివారం రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో ఇంచార్జి జిల్లా కలెక్టర్ వై. మేఘా స్వరూప్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మేఘా స్వరూప్ మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో గ్రామస్థాయిలో పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పశుపాలక రైతుల పశువులు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ శిబిరాల్లో పాలిచ్చే పశువులు, దూడలు, గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ (పురుగుమందుల పంపిణీ), గొర్రెల మశూచి టీకాలు, కోళ్లకు మరియు బాతులకు టీకాలు వేయడం, అలాగే ఉచిత పశు వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పశువుల ఆరోగ్యం మెరుగుపడి రైతులకు ఆర్థికంగా లాభం చేకూరుతుందని ఇంచార్జి కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. టి. శ్రీనివాస రావు మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఉదయం 8.00 గంటల నుండి పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. పశుపాలక రైతులు తమ పశువులను శిబిరాలకు తీసుకొచ్చి ఉచిత పశు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఓ ఎల్. అప్పలకొండ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. టి. శ్రీనివాస రావు, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డా. కె. సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 25న చిన రామాలయం వద్ద ఏకాహం

### - 12వ వార్షికోత్సవం పురస్కరించుకుని -పచ్చిపాల



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో వేంచేసియున్న చిన రామాలయం (శెట్టిబలిజ రామాలయం) వద్ద ఈ నెల 25వ తేదిన స్వస్తి శ్రీ ఛాంద్రమాన శ్రీ విశ్వవాసు నామ సంవత్సర మాఘ శుద్ధ సప్తమి పురస్కరించుకుని ఆదివారం ఉదయం 5 గంటల నుండి పుణ్య దంపతుల పూజా కార్యక్రమాలతో ప్రారంభమై, 6 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు దేదీప్యమానంగా ఏకాహం కార్యక్రమం శెట్టిబలిజ సంఘ సభ్యులు, గ్రామప్రజల ధన సహాయ సహకారాలతో, గ్రామ పురోహితులు గోవింవర్జుల శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం సభ్యుల ఆధ్వర్యంలో ఈఏకాహంకార్యక్రమం నిర్వహించబడుతుందని, శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం అధ్యక్షులు మరియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీ పచ్చిపాల ప్రసాదరావు తెలిపారు.

ఈ ఏకాహం కార్యక్రమంలో శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం, ఓంశక్తి మహిళా భజన సమాజం, శ్రీ షిరిడిసాయి మహిళా భజన సమాజం, సత్యసాయి మహిళా భజన సమాజం, పలు భజన సమాజాలు పాల్గొననున్నాయని ప్రసాదరావు తెలిపారు. ఈ ఏకాహం కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొనాల్సిందిగా ప్రసాదరావు తెలిపారు.

# శనివారం ఘనంగా శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో శనివారం కావడంతో ఘనంగా శ్రీ స్వామివారి ప్రాకార సేవ నిర్వహించారు. ముందుగా అర్చకులు సత్యదేవుని అనంతలక్ష్మి అమ్మవారీ ఉత్సవ మూర్తులను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆశీనులను గావించి వేద పండితుల మంత్రోచ్ఛరణ భక్తుల నామస్మరణతో మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. ఈ ప్రాకార సేవ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు, ఆలయ సూపర్డెంట్లు మరియు దేవస్థానం సిబ్బంది, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అన్న ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించాలి

- పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే బండారు దిశానిర్దేశం
- సంక్రాంతి సంబరాలు విజయవంతం చేసినవారందరికీ కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బండారు



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ఆదివారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, అన్న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన నివాళులు అర్పించాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. శనివారం రావులపాలెం క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ మేరకు వారికి దిశానిర్దేశం చేశారు. అలాగే ఆత్రేయపురం ఉత్సవం, సంక్రాంతి సంబరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ, విద్యామానవవనరుల శాఖా మంత్రి నారా లోకేష్, వివిధ శాఖల మంత్రులు సైతం కొనియాడేలా విజయవంతం చేసిన వారందరికీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి సమిష్టి కృషితో కోనసీమ వైభవం ప్రపంచానికి చాటేలా కృషి చేశారని కొనియాడారు. ఆత్రేయపురం ఉత్సవం, కొత్తపేట ప్రభల తీర్థం మన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, కొప్పిశెట్టి ప్రసాద్ మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండల తెలుగు యువత అధ్యక్షులకు పితృ యోగం

- నివాళులు అర్పించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఉచ్చిలి గ్రామానికి చెందిన తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్ తండ్రి వెచ్చా సూర్యనారాయణ (85) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వెళ్లి నివాళులర్పించారు. ఆయన మృతి పట్ల వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, ముళ్ళపూడి భాస్కరరావు, తోటకూర సుబ్బరాజు, ముదునూరి వీరబాబు రాజు, ఇందుకూరి శ్రీనివాసరాజు, ముదునూరి నరేంద్ర రాజు, జుజ్జువరపు హరిబాబు, తోట రజిని, ముదునూరి గణపతిరాజు, కుటమి నాయకులు నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

# కాకినాడలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన











**- హెలిపాడ్ వద్ద సందడి - ఘన స్వాగతం**
**- పారిశ్రామిక ప్రగతికి సరికొత్త బాట!**

**ఉమ్మడి గోదావరి జిల్లాలో సూర్య బ్యూరో :** పారిశ్రామికాభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రపథాన నిలిపే లక్ష్యంతో, కాకినాడ వేదికగా ఏఎం గ్రీన్ సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ చారిత్రాత్మక ఘట్టంలో పాల్గొనేందుకు విచ్చేసిన గౌరవ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారికి కాకినాడలో ఘన స్వాగతం లభించింది.

**హెలిప్యాడ్ వద్ద సందడి....** హెలిప్యాడ్ వద్ద పవన్ కళ్యాణ్ గారు దిగగానే అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. జిల్లా యంత్రాంగం, కూటమి నేతలు మరియు ప్రాజెక్ట్ ప్రతినిధులు ఆయనకు సాదర ఆహ్వానం పలికారు:

**- అధికార యంత్రాంగం:** జిల్లా కలెక్టర్ మరియు ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలతో గౌరవపూర్వక స్వాగతం పలికారు.

- కూటమి నేతల సంఘీభావం: జనసేన, తెలుగుదేశం మరియు బిజెపి పార్టీల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు పెద్ద ఎత్తున తరలివచ్చి పవన్ కళ్యాణ్ గారికి స్వాగతం పలికారు. కూటమి ఐక్యతను చాటుతూ నేతలు ఆయనతో కరచాలనం చేశారు.

- ఏఎం గ్రీన్ ప్రతినిధుల మర్యాదపూర్వక భేటీ: ఏఎం గ్రీన్ సంస్థకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధులు ఉప ముఖ్యమంత్రిని కలిసి, గ్రీన్ ఎనర్జీ రంగంలో ఈ ప్రాజెక్ట్ పోషించబోయే కీలక పాత్రను వివరించారు. క్లీన్ ఎనర్జీ దిశగా అడుగులు...ప్రపంచవ్యాప్తంగా గ్రీన్ ఎనర్జీకి పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా, కాకినాడలో ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు కావడం రాష్ట్రానికే గర్వకారణమని పవన్ కళ్యాణ్ గారు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ఆకాంక్షించారు. ఈ పర్యటన కాకినాడ పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చే దిశగా ఒక కీలక అడుగుగా నిలిచింది.



# 19 నుండి మాతంగి నవరాత్రి హెూమాలు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** వేద విజ్ఞాన ప్రతిష్టానం ఆధ్వర్యంలో ఈ నెల 19 నుండి 27వ తేదీ వరకు మాఘమాస సందర్భంగా శ్యామలాదేవి (మాతంగి) నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక హెూమాలను నిర్వహిస్తున్నట్లు జ్యోతిష పండితులు డా. పుసులూరి ఫణి శర్మ తెలిపారు. శ్రీ విద్యా పీఠం వ్యవస్థాపకులు గురుతుల్యులు, విద్యా పాదుక త్రిపురానంధ నాథ, దైవజ్ఞ రత్న డా. చెఱుకుపల్లి సూర్య వేంకట లక్ష్మీ నృసింహా శర్మ దివ్య ఆశీస్సులతో మాఘ మాసం సందర్భంగా శ్యామలాదేవి (మాతంగి) నవరాత్రులు. మాఘమాస శుద్ధ పాఢ్యమి నుండి 9 రోజులపాటు హెూమాలు కాకినాడ రామారావు పేట యూనియన్ బ్యాంక్ పక్కన ఉన్న ప్రతిష్టాన కార్యాలయంలో ఈ విశేష హెూమ కార్యక్రమాలు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి 11:30 గంటల వరకు జరుగుతుందని, హెూమంలో పాల్గొనదలచినవారు వారి గోత్రనామాలతో నిత్యపూజ చేయించుకోదలచిన భక్తులు ఈ క్రింది ఫోన్ నెంబర్లకు తెలియపరచవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఈ విశేష హెూమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఫణి శర్మ : 9440490999, 8019966999, శర్మ : 9966618322, దత్తాత్రేయ : 9494663775, రాజేష్ : 9949053889, సత్తిబాబు : 9492146130 ఆయన తెలిపారు. హెూమ కార్యక్రమంలో పాల్గొనే భక్తులు తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులతో రావాల్సి ఉంటుందని ఆయన సూచించారు.

# ప్రజాపాలనలో సరికొత్త అధ్యాయం

## అట్టహాసంగా 'ఉండూరు' సచివాలయం ప్రారంభం!

**- ప్రజల ముంగిటకే వేగవంతమైన సేవలు..**
**- మంత్రి వాసంశెట్టి సుభాష్ సంచలన వ్యాఖ్యలు!**

**ఉమ్మడిగోదావరిజిల్లాల సూర్యబ్యూరో :** అట్టడుగు స్థాయిలోని సామాన్యుడికి కూడా ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగంగా అందడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా శనివారం రామచంద్రపురం మండలం ఉండూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘనంగా ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన పాలనలో తీసుకురాబోతున్న విప్లవాత్మక మార్పులపై కీలక వ్యాఖ్యలు చేశారు.

**పాలనలో పారదర్శకత.. ప్రజలే మా ప్రాధాన్యత!**

ఈ సందర్భంగా మంత్రి సుభాష్ గంభీరంగా మాట్లాడుతూ, "సచివాలయ వ్యవస్థ కేవలం భవనాలకే పరిమితం కాదు, ఇది ప్రజల నమ్మకానికి ప్రతీక" అని పేర్కొన్నారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు:

- ఈ-గవర్నెన్స్ విప్లవం: సాంకేతికతను జోడించి పాలనను సామాన్యుడికి సులభతరం చేశాం. ఇకపై కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, వేగవంతమైన సేవలు అందుతాయి.

**- అధికారులకు హెచ్చరిక:** అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవు. ప్రతి ఉద్యోగి ప్రజా సేవకుడిలా పని చేయాలి.



**- సంక్షేమమే ధ్యేయం:** ప్రభుత్వ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటమే మా కూటమి ప్రభుత్వ లక్ష్యం.

**ప్రజా ప్రతినిధుల కోలాహలం** ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, గ్రామ సర్పంచ్ చిగురుపాటి రామలక్ష్మి, వెల్ల నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు చిగురుపాటి సాయిరాం తదితరులు పాల్గొని, గ్రామాభివృద్ధిలో ఈ సచివాలయం ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మేడిశెట్టి రాధాకృష్ణ, కోట పెక్స్ చైర్మన్ గాలి మకరజ్యోతి, వెలంపాలెం సర్పంచ్ టెకుముడి సత్యనారాయణ, ఉండూరు మాజీ సర్పంచ్ కుక్కల వీరవెంకటరావుతో పాటు భారీ సంఖ్యలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**ముగింపు:** ఆధునిక హంగులతో సిద్ధమైన ఈ సచివాలయం, ఉండూరు గ్రామ ప్రజల కష్టాలను తీరుస్తూ, అభివృద్ధి పథంలో గ్రామాన్ని పరుగులు తీయిస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# సంస్కృతి సంప్రదాయ నిలయాలు పల్లెలే..

– కేంద్ర సంక్రాంతి వేడుకలు ముగింపు సభలో ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : భారతీయ సంస్కృతికి మూలాలు పల్లెలే అని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం కేంద్ర పంచా యతీ కేంద్రంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ మరియు స్థానిక యువత ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సమావేశం లో ఆమె మాట్లాడుతూ సంక్రాంతి అనేది ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన పండుగ కాదన్నారు. వ్యవసాయ ఆధారిత దేశాల్లో పంటలు పండి చేతికి అందే సమయంలో ప్రకృతికి ఆరాధనగా పెద్ద పండుగగా ఘనంగా నిర్వహించుకోవటం జరుగుతుందన్నారు. దీనిలో అనేక సంస్కృతి, ఆచార, సంప్రదాయాలు దాగి ఉన్నాయన్నారు. అలాగే మన గిరిజన ప్రాంత జీవనవిధానంతో పాటూ ప్రకృతి ఆరాధన గిరిజన పండుగలకు ప్రత్యేకమైన విశిష్టత ఉందన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అలాగే మన సంస్కృతి, సంప్రదాయాలు ఆచార వ్యవహారాలు నేటికీ ఆచరణీయంగా ఆమోదయోగ్యంగా ఉన్నాయ న్నారు. భారతీయ సంస్కృతి మూలాలు మన సాంస్కృతిక క్రీడలు పై కూడా చెరగని ముద్రగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే సంక్రాంతి వేడుకలు నేపథ్యంలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన ప్రథమ బహుమతి సాధించిన మాశారవు పద్మ, కేసిరెడ్డి రేష్మా, కేసిరెడ్డి కుసుమకు రూ:15,000/–లు చొప్పున, ద్వితీయ బహుమతి సాధించిన కోన జ్యోతిగారికి రూ:10,000/–లు మరియు తృతీయ బహుమతి సాధించిన అనిమిరెడ్డి సత్యవేణి, ఆచార్తి శివలక్ష్మికి రూ:5000/–లు రూపాయలు ఆమె స్వంత నగదు అందజేశారు. అలాగే పోటీదారులకు పలు బహుమతులు అందజేశారు. నిర్వాహణ కమిటి వారికి అభినందనలు తెలిపారు. రానున్న కాలంలో ఇలాంటి కార్యక్రమాలు విస్తృత పరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎం సీ డైరెక్టర్ కేసిరెడ్డి శివ, తెదేపా నాయకులు పోతల చిట్టిబాబు చిట్టి సుబ్బారావు, ఎల్.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## చెట్టు నీడలోనే రావులమ్మ తల్లి

– వైభవంగా అమ్మవారి జాతర మహోత్స వేడుకలు



జగ్గంపేట, మేజర్ న్యూస్ : గుళ్ళు గోపురాలు వద్దు.. చెట్టు నీడే చాలు అంటూ భక్తుల కొంగు బంగారమై.. కోరిన కోరికలు తీరుస్తూ.. విరాజిల్లుతున్నారు రావులమ్మ తల్లి అమ్మవారు. జగ్గంపేట గుర్రప్పాలెం రోడ్లో వేంచేసి ఉన్న రావులమ్మ అమ్మవారు జాతర మహోత్సవ వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా అమ్మవారు ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. జాతర వేడుకలను సంక్రాంతి వెళ్లిన మరుసటి రోజున ఘనంగా నిర్వహిస్తారు. జగ్గంపేటకు చెందిన జీను వారి స్థలంలో అమ్మవారిని కొలుస్తారు. చెట్టు నీడలో వెలిసిన అమ్మవారిని పూర్వం గ్రామస్తులు ఆలయ నిర్మించేందుకు తలపెట్టగా, అమ్మవారు నాకు గుళ్ళు, గోపురాలు.. వద్దు అని పెట్టు చెట్టు నీడలోనే ఉంటూ భక్తులకు దర్శనమిస్తానగుడి నిర్మించకుండా ప్లాస్టిక్ రేకు షెడ్యూల్ లోనే అమ్మవారిని పూజిస్తున్నారు. ఈ ప్రాంతాన్ని రావులమ్మ నగరగా నామ కరణం చేశారు. అమ్మవారిని పూజిస్తే కోరిన కోరికలు తీరుతాయన్న భక్తుల ప్రగాఢ విశ్వాసం.

## శృంగార వల్లభ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

– వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివార్కి ప్రత్యేక అలంకరణ



పెద్దాపురం,మేజర్‌న్యూస్ : పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వాహాధికారి వడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనటికెట్ల ద్వారా రూ. 2,35, 510/–, అన్నదాన విరాళాల ద్వారా రూ. 1,53,367/–లు, కేశఖండన ద్వారా రూ. 2,800/–, తులాభారం ద్వారా రూ. 700/– లడ్డూ ప్రసాదాల ద్వారా రూ. 23,655/–మొత్తం రూ. 4, 16,032/–లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. వేద పండితులు ఆధ్వర్యంలో స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది.

అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ మొయిళ్ళ సంధ్య కృష్ణమూర్తి, ధర్మకర్తలు, వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, గ్రామస్థులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## సబ్ ట్రెజరీ కార్యాలయంలో జీవన ప్రమాణ పత్రాల అందజేతకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు

– ఎటిఓ కాళీకృష్ణ



పెద్దాపురం, మేజర్‌న్యూస్ : జీవన ప్రమాణ పత్రాలు ఉద్యోగ విరమణ పొందిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కుటుంబ ఫించ నుదారులు, వార్షిక జీవన ప్రమాణ ధృవీకరణ పత్రం సమర్పణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం మరింత సులభతరం చేసిందని, పెద్దాపురం ఎటిఓ ఎ.కాళీ కృష్ణ తెలిపారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానంలో ఈ నెల 1 నుండి ఫిబ్రవరి 28 వరకు నమోదుకు అవకాశం ఇచ్చిందని, పెద్దాపురం సబ్‌ట్రెజరీ పరిధిలో ఉన్న ఫించనుదారులు జీవన ప్రమాణ పత్రాలు అందజేయాలని దానికి సంబంధించి పెద్దాపురం సబ్ ట్రెజరీ కార్యాలయం నందు ప్రత్యేక కౌంటరును ఏర్పాటు చేయడం జరిగిందని, కావున పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు, కుటుంబ ఫించనుదారులు ఈ విషయం గ్రహించాలని ఆయన తెలిపారు. పెద్దాపురం సబ్‌ట్రెజరీ పరిధిలో మొత్తం 1679 మంది జీవన ప్రమాణ పత్రాలు సమర్పించవలసి ఉండగా, ఇప్పటివరకు 50 శాతం మంది జీవన ప్రమాణ పత్రాలు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా అందజేశారని, కావున మిగతా ఫించనుదారులు, కుటుంబ ఫించనుదారులు కూడా త్వరితగతిన అందజేయాలని ఆయన సూచించారు. అలాగే ఆరోగ్యం క్షీణించి మంచానికే పరిమితమైన వారి వద్దకు తమ కార్యాలయ సిబ్బంది వెళ్ళి ముఖ ఆధారిత నమోదు ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు తీసుకోవడం జరుగుతుందని, ఎటిఓ వివరించారు.

## తెదేపా సీనియర్ నాయకులు రాజి రాంబాబు మృతి

– సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : తెదేపా సీనియర్ కార్యకర్త రాజి రాంబాబు మృతి అత్యంత బాధాకరమని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి సంతాపం వ్యక్తం చేశారు. రాజవొమ్మంగి మండలం రాజవొమ్మంగి గ్రామానికి చెందిన రాజి రాంబాబు శుక్రవారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న ఆమె శనివారం ఉదయం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. జరిగిన విషాదకర సంఘటనపై కన్నీరు మున్నీరు అయ్యారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని శోకతప్త హృదయంతో ఓదార్పు చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. పార్టీలో చాలా చురుకుగా ఉండే ఆయన ఆకస్మికంగా మృతి చెందటం కుటుంబానికి మన పార్టీకి తీరని లోటన్నారు. నిజంగా మన తెదేపా పార్టీలో క్రమశిక్షణ గల కార్యకర్తను కోల్పోయిన సంఘటన విషాదం అన్నారు. ఆయన భౌతిక కాయంపై పూలమాలలు వేసి ఆమె,మరియు ఆమె భర్త రంపచోడవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయ్ భాస్కర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గొల్లపూడి పెద్దిరాజు, ముప్పన కేశవ్, సీనియర్ నాయకులు దంతులూరి శివాజీ రాజు, జెట్టి మధు తదితరులు పాల్గొన్నారు.

# బాప్టిస్ట్ ఆస్తుల పరిరక్షణకు ఫీల్డ్ కౌన్సిల్ కృషి...



సామర్లకోట, మేజర్ న్యూస్ : బాప్టిస్ట్ ఆస్తుల పరిరక్షణకు ఫీల్డ్ కౌన్సిల్ కృషి చేస్తుందని సామర్లకోట బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ నాయకులు అన్నారు. సామర్లకోట బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ 2026 సంవత్సరపు మొదటి సమావేశం సామర్లకోట సిబియం హై స్కూల్లో శనివారం జరిగింది. ఫీల్డ్ కౌన్సిల్ అధ్యక్షులు సంజీవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాప్టిస్ట్ ఆస్తులు ఎక్కడున్నా వాటిని పరిరక్షించి క్రైస్తవ సమాజానికి ఉపయోగపడే రీతిలో వినియోగించేందుకు వీలుగా చర్యలు చేపడుతున్నట్లు నాయకులు చెప్పారు. ఫీల్డ్ కౌన్సిల్ చరిత్రను వారు గుర్తు చేస్తూ క్రీ.శ. 1882 లో స్థాపించబడిన సి బి సి యన్ సి సంస్థ కార్యకలాపాలు కొనసాగించటానికి, కార్యరూప ఆచరణ నిమిత్తమును చర్చించటానికి, గత 17 సంవత్సరాలుగా, మొదటి, ఏకైక బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్‌గా 25 సంఘాలు, 3 జోన్లుగా కలిగి కొనసాగించబడటం గమనార్హం అన్నారు. బాప్టిస్ట్ ఆస్తుల పరిరక్షణ విషయంలో బాధ్యతలు, జాగ్రత్తలు, సంరక్షణ విషయంలో ఈ సందర్భంగా చర్చించి ఆస్తుల పరిరక్షణ విషయమై సమావేశ కమిటీ సభ్యులు అందరు మాట్లాడి ప్రార్థించారు. ఈ సందర్భంగా బాప్టిస్ట్ ఆస్తుల పరిరక్షణకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో సిబియం హై స్కూల్ కస్టోడియన్ యాని సుజాత, సామర్లకోట బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ అధ్యక్షులు సంజీవరావు, ఉప అధ్యక్షులు ఐ ఈ జీవన్ కుమార్, కార్యదర్శి యం డీ వి ప్రసాద్, కోశాధికారి విజయ్ కుమార్, సలహాదారు పిట్టా సత్యనారాయణ, పలు బాప్టిస్ట్ సంఘాల నాయకులు,ప్రతినిధులు,రాయభారులు, పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన కొత్తపేట ప్రభల ఉత్సవం






- ప్రత్యేక ఆకర్షణీయంగా ప్రభల అలంకరణలు
- ఐదు శతాబ్దాల నుండి కొనసాగింపు
- రంగులమయంగా బాణసంచా కాల్పులు...
- జనసందోహంగా మారిన రహదారులు

**కొత్తపేట, మేజర్ న్యూస్ :** సంక్రాంతి ప్రభల ఉత్సవం అంటే ముందుగా గుర్తొచ్చేది కోనసీమ. ఉభయగోదావరి జిల్లాల్లో ప్రభల ఉత్సవాలకు భిన్నంగా మకర సంక్రాంతి రోజున గురువారం కోత్తపేటలో ప్రభల ఉత్సవం కనులవిందుగా జరిగింది. సుమారు 500 ఏళ్ల నుండి అనాది నుంచి వస్తున్న ఆనవాయితీ. ఈ ఉత్సవం మకర సంక్రాంతి ఉదయం మొదలై మరుసటి కనుమ రోజు ఉదయం వరకు నిరంతరాయంగా నిర్వహించారు. సంక్రాంతి రోజు జరిగే ప్రభల ఉత్సవానికి ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. స్థానిక పాతరామాలయం, కొత్త రామాలయం, బొడిపాలెం వీధుల వారు ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ ప్రభలను ఆకర్షణీయంగా శ్రీ వీరభద్రస్వామి వారిని, వివిధ దేవతా మూర్తులను రంగురంగుల ధారాలతో,కొత్త వస్త్రాలతో అలంకరించి రూపుదిద్దారు. మొదటి బృందంగా పాత రామాలయం, రెండో బృందముగా కొత్త రామాలయం వీధుల ప్రభలు ఆయా వీధుల్లో ఉరేగించిన అనంతరం ప్రధాన రహదారిపై మేళతాళలతో,సంగీత వాయిద్యాలతో, యువకుల కేరింతలతో, ఆటపాటలతో కొత్తపేట హై స్కూల్, జూనియర్ కాలేజ్ ప్రాంగణానికి ఉరేగింపుగా తీసుకువెళ్లారు. ప్రభలను వివిధ రకాలుగా అలంకరించడంతో ప్రత్యేక ఆకర్షణీయంగా చూపరులను ఆకట్టుకుంది. ఈ ప్రభలను దర్శించుకునేందుకు ప్రజా ప్రతినిధులే కాకుండా రాష్ట్రం నలుమూలల నుండే కాక, ఇతర రాష్ట్రాల నుండి, తమ స్వగ్రామలకు అనేక ప్రజలు తరలివచ్చారు. దీంతో ఎక్కడికక్కడే రహదారులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి.

**-రంగులమయంగా బాణసంచా కాల్పులు..** సంక్రాంతి ప్రభల ఉత్సవంలో బాణసంచా కాల్పులు రంగులమయంగా మారింది. ప్రభలను ఒక చోటకు చేరిన తరువాత కళాశాల ప్రాంగణంలో ప్రధాన రెండు వీధులతో పాటుగా బోడిపాలెం వీధి భారీ ఎత్తున అబ్బురపరిచే విధంగా, రంగురంగులను వెదజల్లే విధంగా మందుగుండు బాణసంచా సామాగ్రిలను పోటా పోటీగా



జరిగిన కాల్పులు అబ్బురపరిచాయి. రాత్రి సమయంలో పలు వినోద కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. తెల్లవారుజామున పాతరామాలయం, కొత్త రామాలయం వీధులవారు భారీ ఎత్తున బాణసంచా కాల్పులతో ముగించారు. ఈ ఉత్సవంలో బాణసంచా కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**-ప్రభలను దర్శించుకున్న ఎమ్మెల్యే...** తెదేపా ఇంచార్జ్ బండారు సత్యానందరావు, జనసేన ఇంచార్జి బండారు శ్రీనివాసరావు అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు కళాశాల, హై స్కూల్ ప్రాంగణంలో ప్రభలను దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**-కనుమ రోజు ప్రభల ఉత్సవం...** కనుమ రోజు మండల పరిధిలో వాడపాలెం, మందపల్లి, అవిడి గ్రామాల్లో జరిగిన ప్రభల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వరి చేలల్లో నుండి ప్రభలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆయా స్థలాలలో భక్తుల సందర్శనార్థం ఉంచారు.

**-పోలీసుల నిఘాలో ప్రభల ఉత్సవం...** ఈ ప్రభల ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అదేశాలతో అదనపు ఎస్పీ ఏ.వి.ఆర్.పి.బి ప్రసాద్ పర్యవేక్షణలో కొత్తపేట డిఎస్పీ ఎస్.మురళీమోహన్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించి, భద్రత ఏర్పాట్లు చేశారు. సుమారు 400 పోలీసులు పాల్గొని ఎటువంటి సంఘటనలు జరగకుండా గస్తీ నిర్వహించారు.

# ఆకట్టుకున్న "ఇది కాదా ముగింపు" నాటిక



**అనపర్తి, మేజర్ న్యూస్ :** సంక్రాంతి సంబరాలు పురస్కరించుకొని మండలంలోని, పొలమూరు గ్రామంలో డిఎన్ఆర్ గ్రౌండ్‌లో శ్రీ శారద కళానికేతన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇది కదా ముగింపు నాటిక ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. నేటి సమాజంలో చోటుచేసుకున్న పరిణామాలను కళ్లకు కట్టినట్లుగా దేశానికి రైతు సేవలు ఎంత అవసరమో, దేశ రక్షణకు సైనికుడు సేవలు కూడా అంతే అవసరమని సమాజానికి తెలిపే రీతిలో ఈ నాటిక సాగింది. మంచి ముందు చెడు ఎప్పటికీ గెలవదని, చెడు వ్యసనాలకు బానిసైతే జీవితం అంధకారమవుతుందని అద్భుతంగా చూపిస్తూ మంచి ప్రదర్శనను అందించారు. సత్తి లక్ష్మీ భవిష్య కూచిపూడి నిత్య ప్రదర్శన, కర్రీ జోష్ణ కృష్ణ శ్రీ భరతనాట్య ప్రదర్శన ప్రజల మనసులను హద్దుకున్నాయి. దిక్కు ముక్కు లేని సన్మానం, బయోడేటా, జనాభా లెక్కలు వంటి హాస్య నాటకాలు కూడా అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా శారదా కళానికేతన్ వారు మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా నాటకరంగం దోహదపడుతుందని, ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు నాటక రంగం కీలకపాత్ర పోషిస్తుందని, నాటక రంగాన్ని ప్రోత్సహించే బాధ్యత మనందరిపై ఉంటుందని అన్నారు. తిరుపతికి చెందిన శ్రీ శృంగార వల్లభ ఆర్ట్స్ వారు ప్రదర్శించిన ఇది కదా ముగింపు నాటికలో పాత్రధారులైన యాడవిల్లి వాసు, భుజంగరావు, అడబాల శ్రీను, సత్యనారాయణ, మాధవిలనుసన్మానించారు. కళారంగాన్ని ప్రోత్సహించినందుకు గాను కొవ్వూరి వెంకటరెడ్డి తనయుడు కొవ్వూరి జనక దత్తారెడ్డి, ద్వారంపూడి మంగిరెడ్డి తనయుడు ద్వారంపూడి వెంకట రామారెడ్డిలకు చిరు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో కళాభిమానులు, కళాకారులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## బూత్ కన్వీనర్ల కుటుంబాలకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శ

- ఇరువురు బూత్ కన్వీనర్లను కోల్పోవడం బాధాకరమన్న ఎమ్మెల్యే బండారు
- వారి కుటుంబాలకు అండగా ఉంటానని హామీ



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెంలో ఇటీవల మృతి చెందిన ఇరువురు బూత్ కన్వీనర్ల కుటుంబాలను ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు శనివారం పరామర్శించారు. రావులపాలెం గ్రామానికి చెందిన 81వ బూత్ కన్వినర్ నేకూరి ప్రసాద్ మరియు గోపాలపురం గ్రామానికి చెందిన 131వ బూత్ కన్వినర్ పులిదిండి భీమరాజు వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆర్థిక సాయం అందజేశారు. వారి కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే ఇరువురు బూత్ కన్వీనర్లను కోల్పోవడం బాధాకరమన్నారు. తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, బలగమన్నారు. పార్టీ సిద్ధాంతాలు, విధానాలను బూత్ లెవల్లో ప్రజల్లోకి తీసుకువెళ్లేది బూత్ కన్వీనర్లేనన్నారు. అటువంటి ఇరువురిని కోల్పోవడం పార్టీకి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరువురి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

# లొల్లలో అశ్లీల నృత్యాలు

- కొట్టుకున్న యువత - చోద్యం చూసిన అధికారులు





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మండల పరిధిలో లొల్ల గ్రామంలో గురువారం రాత్రి అశ్లీల నృత్యాలు అడ్డు అదుపు లేకుండా సాగాయి. లొల్లాలమ్మ జాతర సందర్భంగా కూటమి నాయకులు పోటా పోటీలుగా వీధికో అశ్లీల నృత్యాన్ని ఏర్పాటు చేయడంతో లొల్ల గ్రామంలో అశ్లీల నృత్యాలు చూస్తూ యువత జోగారు. లొల్లాలమ్మ జాతర సందర్భంగా గ్రామంలో వీధికి ఒకటి వంతున 9 అశ్లీల నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. మహిళను ట్రాక్టర్‌పై ఎక్కించి వారితో అశ్లీల నృత్య ప్రదర్శనలు ప్రారంభించారు. కళ్ళముందు జరుగుతున్నా, అధికారులు పట్టించుకోకపోవడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి కార్యక్రమాలకు యువత పోటెత్తడంతో కొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి.

## ఉపముఖ్యమంత్రికి స్వాగతం పలికిన తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్‌కు శంకుస్థాపన చేసేందుకు కాకినాడ విచ్చేసిన రాష్ట్ర ఉపముఖ్య మంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ని హెలీప్యాడ్ వద్ద తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ శనివారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ గ్రీన్ అమో నియా ఉత్పత్తిలో కొత్త చరిత్రకు నేడు ఏపీలో శ్రీకారం చుట్టేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టును కాకినాడలో ఏర్పాటు చేయడం ద్వారా ఏటా 1.5 మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఎగుమతి అవుతుందన్నారు. జర్మనీ, సింగపూర్, జపాన్ కు అమ్మోనియా ఎగుమతులు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో 8 వేలమందికి ఉద్యోగ అవకాశాలు ద్వారా యువతకు మేలు జరుగుతుందని నవీన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.